నాణ్యతను విధిగా పాటించాలి : జెసి

ప్రజాశక్తి - రాయచోటి

ఆహార పదార్థాల తయారీలో నాణ్యతను, శుభ్రతను విధిగా పాటించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మన్ అహ్మద్‌ఖాన్ వ్యాపారులు, హోటల్ యజమానులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా ఆహార భద్రతా శాఖ ఆధ్వర్యంలో జెసి అధ్యక్షతన ఆహార భద్రత పై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో అన్నమయ్య జిల్లా ఆహార పదార్థాల వ్యాపారులు, రెస్టారెంట్, హోటల్, బేకరీ స్వీట్ షాపుల యజమానులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను ఇస్తోంది అన్నారు. ఆహార పదార్థాల తయారీ వ్యాపారులు నాణ్యతను, పరిశుభ్రతను విధిగా పాటించాలన్నారు. వంట నూనెను రెండు, మూడు సార్లకంటే ఎక్కువ వాడకూడదని సూచించారు. ఆహార పదార్థాల తయారీలో హానికరమైన రంగులు వడరాదని చెప్పారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. సదస్సులో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి డాక్టర్ కె.షమీమ్‌బాష, ఫుడ్ సెఫ్టి ట్రైనర్ డాక్టర్ సి.ఆంజనేయులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : వ్య.కా.స

నేలకొరిగిన అరటి తోటలను పరిశీలిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-ఓబులవారిపల్లె

మిచౌంగ్ తుపాన్ బీభత్సం వల్ల పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.జయరామయ్య డిమాండ్ చేశారు. గురువారం మిచౌంగ్ తుపాన్ వల్ల నేలమట్టమైన అరటి, ఆకుతోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. లేకపోతే ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. తుపాన్ కారణంగా అరటి తోట ఎకరానికి రూ.2 లక్షల చొప్పున నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కేవలం ఆదేశాలకే పరిమితమయ్యారే తప్ప సహాయక చర్యలు చేపట్టలేదని వాపోయారు. రెండు, మూడు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాల వల్ల రోజువారి కూలి చేసుకునే పేదలకు పూట గడవడమే కష్టంగా ఉందని అలాంటి వారికి భోజనం ఏర్పాటు చేయాల్సిన బాధ్యతను అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లాలో ఆరా కొరగా సాగు చేసిన చేతికొచ్చిన వరి, అరటి, తమలపాకు, బొప్పాయి పంటలు పూర్తిగా చేలోనే నేలకొరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా కేంద్రాలలో రైతులకు అవసరమైన వ్యవసాయ యంత్రాలు అందుబాటులో ఉంటాయని చెబుతున్నప్పటికీ ఆచరణలో ఎక్కడా లేవని వరి కోత మిషన్లు యంత్రాలన్నీ వైసిపి నేతల ఇళ్లలో ఉన్నాయని విమర్శించారు. యంత్రాల అందుబాటులో ఉంటే సగానికి పైగా పంట నూర్పిడి సకాలంలో చేసుకునే వారన్నారు. దాన్యం కప్పుకోవడానికి, పట్టలు సరఫరా కూడా ప్రభుత్వం నిలిపేసిందని రైతులు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. తక్షణం ప్రభుత్వం దెబ్బతిన్న పంటల వివరాలను నమోదు చేసి పంటల బీమా పెట్టుబడి రాయితీ పరిహారాన్ని స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తక్షణం తుపాన్ సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో మహిళా సంఘం మండలం నాయకులు ఎం.మంజుల, సిఐటియు మండలం కార్యదర్శి కె.వి.రమణ. కెవిపిఎస్ మండల కార్యదర్శి పెంచలయ్య, గిరిజన నాయకులు ఎం.రమణ, టి.పాపయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల అభివృద్ధికి పెద్దపీట : కలెక్టర్

మహిళా డ్రైవర్‌కు ఆటో పంపిణీ అనంతరం ప్రయాణిస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

మహిళల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని కలెక్టర్ గిరీష పిఎస్ పేర్కొన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్నతి - మహిళాశక్తి పథకం ద్వారా డ్వాక్రా మహిళలకు మంజూరైన ఆటో రిక్షాలను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతి మహిళాశక్తి పథకం కింద ఎస్‌సి, ఎస్‌టి నిరుపేద మహిళలకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వడ్డీ లేని రుణాల ద్వారా అన్నమయ్య జిల్లాలో 11 మంది మహిళలకు ఆటోలు అందజేశామని చెప్పారు. .ఇందులో ఒక్కొక్క లబ్ధిదారు 10 శాతం వాటా చెల్లించాల్సి ఉంటుందన్నారు. మిగిలిన 90 శాతం వడ్డీ లేని రుణం ద్వారా 48 కంతులలో తిరిగి డబ్బు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభివృద్ధికి అనేక పథకాలు ప్రవేశపెడుతుందని అర్హులందరూ ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. పథకం కింద అందించిన ఆటోలను లబ్ధిదారులు అమ్ముకోకుండా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళా లబ్ధిదారులకు కలెక్టర్ చేతుల మీదుగా ఆటోలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, ఏరియా కో-ఆర్డినేటర్లు లబ్ధిదారులు పాల్గొన్నారు.

మూడు రోజులైనా తొలగని శిథిలాలు

- వాహనాల రాకపోకలకు అంతరాయం
- అంబులెన్స్ వెళ్లడానికి దారిలేక ఇక్కట్లు

ప్రజాశక్తి-పీలేరు : మేళ్లచెరువులో పాఠశాల ప్రహరీ కూలి మూడు రోజులవుతున్నా శిథిలాలు తొలగించని కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. గురువారం అక్కడి దళితవాడలో ఓ మహిళ పురిటి నొప్పులతో బాధపడుతుండగా ఆసుపత్రికి తరలించేందుకు 108 అంబులెన్స్‌కు కాల్ చేశారు. అంబులెన్స్ వెళ్లడానికి దారి లేక పోవడంతో జడ్పీ హైస్కూల్ దగ్గరే అంబులెన్స్ ఆగిపోయింది. ఇక చేసేది లేక పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళ కుటుంబ సభ్యుడే రోడ్డుకు అడ్డంగా పడి ఉన్న ప్రహరీ శిథిలాలను తొలగించుకుని అంబులెన్స్‌కు దారి ఏర్పరుచుకోవాల్సిన పరిస్థితి నెలకొందని, అత్యవసర పరిస్థితుల్లో బాధితులు మట్టి తొలగిస్తుంటే పాఠశాల సిబ్బంది చోద్యం చూస్తూ నవ్వుకున్నారే తప్ప కనీస మానవీయతైనా చూపలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా పంచాయతీ సిబ్బంది చొరవ చూపి రోడ్డుకు అడ్డంగా ఉన్న శిథిలాలను తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాల్సిన అవసరం ఉంది.

అంబులెన్స్‌కు దారి ఏర్పరుస్తున్న బాధితురాలి కుటుంబ సభ్యుడు

విద్యార్థులు ఆధునికత వైపు దృష్టి సారించాలి

- జాతీయ సదస్సులో పలువురు వక్తలు

ప్రజాశక్తి-మదనపల్లి

ఇంజినీరింగ్ విద్యార్థులు ఆధునికత వైపు దృష్టి సారించి భవిష్యత్తుకు బాటలు వేసుకుని విద్య నభ్యసించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఆప్టిమైజేషన్ టెక్నిక్స్ ఫర్ లెర్నింగ్‌ను గురువారం ఘనంగా ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వనతో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, అతిధులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముందుగా ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రతిష్టాత్మకమైన ఐఇఇఇ వారి సహకారంతో మా కళాశాలలో ఈ అంతర్జాతీయ సదుస్సును నిర్వహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి తైవాన్‌లోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, అకాడెమియా సినికా, ప్రొఫెసర్ డాక్టర్ వెన్-లియాంగ్ హ్వాంగ్, జర్మనీలోని ఈస్ట్‌బవేరియన్ టెక్నికల్ యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అంబర్గ్‌వైడెన్, ఎలక్ట్రికల్ విభాగం ఇంజినీరింగ్, మీడియా, కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ డాక్టర్ టట్యానా ఇవనోవ్నా, జపాన్‌లోని గకుషుయిన్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ యుకారి శిరోటా, క్యాంపస్ హాగెన్‌బర్గ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ అప్లైడ్ సైన్సెస్ అప్పర్ ఆస్ట్రియా ప్రొఫెసర్ డాక్టర్ పీటర్ బర్గ్‌స్టాలర్, స్విట్జర్లాండ్‌లోని విశ్వవిద్యాలయం అప్లైడ్ సైన్సెస్ ప్రొఫెసర్ డాక్టర్ సెడ్రిక్ బోర్నాండ్ యుఎస్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మెంఫిస్ గణితశాస్త్ర ప్రొఫెసర్ ప్రొఫెసర్ డాక్టర్ రాబర్ట్ కోజ్మా, ప్రొఫెసర్ సంఘమిత్ర బంద్యోపాధ్యాయ, మెషిన్ ఇంటెలిజెన్స్ యూనిట్ డైరెక్టర్, ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్టిట్యూట్, కోల్‌కతా ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారని పేర్కొన్నారు. మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌లో పనిచేస్తున్న అకాడెమియా, పరిశ్రమలకు చెందిన పరిశోధకులు, ఇంజినీర్లు, శాస్త్రవేత్తలను వారి అప్లికేషన్‌లను ఒకచోట చేర్చడానికి ఒక ప్రధాన అంతర్జాతీయ సమావేశంకు నాందిగా ఈ కార్యక్రమంను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. తాజా రచనలు, పరిశోధన ఫలితాలను ప్రదర్శించడానికి, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సాఫ్ట్-కంప్యూటింగ్, ఇంటెలిజెంట్ సిస్టమ్స్, పర్సెప్షన్, కాగ్నిటివ్ సైన్స్, సైకాలజీ, డేటా అనాలిసిస్, ఐటికి సంబంధించిన వివిధ సబ్జెక్టులపై ప్రత్యేక సెషన్‌లు ఈ కాన్ఫరెన్స్‌లో ఉంటాయని తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ వెన్-లియాంగ్ హ్వాంగ్, జర్మనీ మాట్లాడుతూ ఇలాంటి అంతర్జాతీయ సదస్సులు ప్రపంచంలో జరుగుతున్న నూతన పరిశోధనలను అందరికి పరిచయం చేయడానికి ఉపయోగపడుతాయన్నారు. సాంకేతిక రంగంలో ఉండే అనేక మంది పరిశోధకులు ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనలు చేస్తున్నారని, మెషిన్ లెర్నింగ్‌తో మొదలుకొని, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలలో దిన దినాభివృద్ధి జరుగుతున్నాయని చెప్పారు. టెక్నాలజీ పరంగా ఎంతో ముందుకు వెళుతున్నామని పేర్కొన్నారు. పరిశోధన పత్రాలు ప్రఖ్యాతి పొందిన ఐఇఇఇలో ప్రచురణ చేయడం వారి కెరీర్‌కు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో పాల్గొన్న ఎంతో మంది పరిశోదలకులు వారి పరిశోధన పత్రాలు ఇక్కడ ప్రదర్శించడం, వారి ఆలోచనలను అందరితో పంచుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ డాక్టర్ నిధ్యా, డీన్ డాక్టర్ గౌతమ్ చక్రవర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న పరిశోధకులు

సైనికుల సేవలు వెలకట్టలేనివి : గిరీష

జిల్లా సైనిక సంక్షేమ నిధికి విరాళం ఇస్తున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి - రాయచోటి

దేశ రక్షణలో ప్రాణాలకు ఎదురొడ్డి సైనికులు చేస్తున్న సేవలు వెల కట్టలేనివని కలెక్టర్ గిరీష అన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం పురస్కరించుకుని గురువారం రాయచోటి కలెక్టరేట్ ఆవరణలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాయుధ దళాల నిధికి విరాళాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి తమ వంతు బాధ్యతగా కలెక్టర్ విరాళం అందజేశారు. జిల్లాలోని సైనికులు, మాజీ సైనికులు, వారి కుటుంబ సభ్యులకు కలెక్టర్ శుభాకాంక్షలను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణలో భాగంగా సరిహద్దులలో ఎంతోమంది సైనికులు ప్రాణత్యాగం చేశారని , వారికి ప్రజలంతా రుణపడి ఉండాలని చెప్పారు. భారత సైనిక దళాలు, మొక్కవోని దీక్షతో చూపిన దేశభక్తి, సాహసం, త్యాగాలపై దేశం గర్విస్తోందన్నారు. పాకిస్థాన్, చైనా యుద్ధ సమయాల్లో, కార్గిల్ యుద్ధం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో సైనికుల ధైర్య సాహసాలు, తెగువకు జాతి యావత్తు గర్విస్తోందన్నారు. ఎంతో మంది సైనికులు దేశ రక్షణలో ప్రాణాలు అర్పించారని తెలిపారు. వీర జవాన్లకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పతాక నిధికి విరాళాలు అందిస్తే ఆదాయ పన్ను రాయితీ లభిస్తుందన్నారు. సాయుధ దళాల పతాక నిధికి ప్రజలు తమ వంతు బాధ్యతగా విరివిగా విరాళాలు ఇవ్వాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా సైనిక్ సంక్షేమ శాఖ అధికారి ఐజే రఘురామయ్య, కార్యాలయ సిబ్బంది నవనీశ్వర్ రెడ్డి, సురేష్ కుమార్, ఎన్‌సిసి విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరాజు

'జ్ఞానాంబిక'లో వినియోగదారుల దినోత్సవం

ప్రజాశక్తి-మదనపల్లి

పేస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీజ్ఞానాంబికా డిగ్రీ కళాశాలలో జాతీయ వినియోగదారుల మాసోత్సవాలలో భాగంగా విద్యార్థులకు వినియోదారుల హక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు కరస్పాండెంట్ డాక్టర్ గురుప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా పౌరసరఫరాల అధికారి కె.రఘురాం మాట్లాడుతూ విద్యార్థి దశనుండే వినియోగదారుల హక్కులపై అవగాహన పెంచుకోవడం ద్వారా ఉత్తమ వినియోదారుడుగా మారవచ్చునన్నారు. కళశాల కరెస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రజలలో అవగాహనా లోపం వల్ల నాసిరకమైన లేక కల్తీతో కూడిన వస్తువులు రాజ్యమేలుతున్నాయని తెలిపారు. పేస్ సంస్థ డైరెక్టర్ వి.ఎస్.రెడ్డి మాట్లాడుతూ వినియోగదారులకు తక్కువ ఖర్చులో ఇబ్బందులకు తావు లేని రీతిలో శీఘ్రంగా ఫిర్యాదులను పరిష్కరించే వెసులుబాటు కల్పించామన్నారు. పేస్ స్వచ్ఛంద సంస్థ విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించగా ప్రథమ బహుమతి బి.మేఘన రూ.1500, ద్వితీయ బహుమతి బి.సాయి జ్యోత్స్న రూ.1000, తృతీయ బహుమతి ఎస్.ఎస్.హుమయూన్ అన్సారి రూ.500 గెలుచుకున్నారు. పోటీలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎం.ఉత్తమేశ్వర రావు, కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, డెప్యూటీ తహశీల్దార్ జి.రెడ్డెప్ప, శ్రవణ్‌రెడ్డి, లెక్చరర్ శ్రీరాములు విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం : 'యల్లటూరు'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

జనసేన నేతలందరూ కలిసికట్టుగా పయనించి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని జనసేన నాయకులు యల్లటూరు శ్రీనివాసరాజు అన్నారు. ఇటీవల పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిన ఆయన మంగళగిరి నుంచి రాజంపేటకు విచ్చేసిన సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. జనసైనికులు, కార్యకర్తలు, అభిమానులు అడుగడుగునా ఆయనకు నీరాజనం పలికారు. అనంతరం పట్టణ శివారులోని న్యూ ఆంధ్ర కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన జనసేన జనసేన ఐక్య సమ్మేళన వేదికలో ఆయన ప్రసంగిస్తూ పవన్ కల్యాణ్ ఆశయాలు, జనసేన సిద్ధాంతాలు తనను ఆకర్షించాయని పేర్కొన్నారు. ప్రజాసేవ చేసేందుకు జనసేన పార్టీనే తనకు సరైన వేదిక అని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. టిక్కెట్ ఎవరికి కేటాయించినప్పటికీ నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ జనసేన జెండా ఎగురవేసేందుకు వివిధ హోదాలలోని నేతలు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఐకమత్యంతో సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి సయ్యద్ ముఖరంచాన్, అసెంబ్లీ ఇన్‌ఛార్జి మలిశెట్టి వెంకటరమణ, రాష్ట్ర నాయకులు తాతంశెట్టి నాగేంద్ర, షబ్బీర్‌అలీ, సింగంశెట్టి నాగేంద్ర, శివరామరాజు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. మాధవరంలో జనసేన పార్టీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సినీనటి అనసూయ

రాజంపేటలో సినీనటి అనసూయ సందడి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

చెన్నై వారి ఎంజిఆర్ నూతన వస్త్రాలయ ప్రారంభోత్సవం గురువారం పాత బస్టాండ్ సమీపంలో ఘనంగా నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సినీనటి అనసూయతో పాటు స్థానిక ఎమ్మెల్యే మేడా మల్లిఖార్జునరెడ్డి, జడ్‌పి చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి, టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు చమర్తి జగన్ మోహన్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్రాయులు పాల్గొని వస్త్రాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అనసూయ మాట్లాడుతూ ఎంజిఆర్ వస్త్రాలయం దేశంలోని ప్రముఖ నగరాలతో పాటు నేడు రాజంపేటకు రావడం ఈ ప్రాంత ప్రజలకు సదవకాశమని పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే ధరలతో పాటు నాణ్యమైన వస్త్రాలు అందించడం ఎంజిఆర్ ప్రత్యేకతన్నారు. పండుగలు, వివాహాది శుభకార్యాలకు ప్రత్యేక ఆఫర్లతో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరల్లో ఉంటాయని వివరించారు. అనసూయను చూసేందుకు రాజంపేట వాసులు పెద్ద ఎత్తున ఎగబడ్డారు.

యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా శివారెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి



ఇటీవల నిర్వహించిన అన్నమయ్య జిల్లా యుటిఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో టి.శివారెడ్డిని రాష్ట్ర కౌన్సిలర్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని డివిజన్ నాయకులు చంద్రశేఖర్, శామీర్, సురేంద్ర రెడ్డి, కిఫాయతుల్లా గురువారం తెలిపారు. ఈ సందర్భంగా శివా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర కౌన్సిలర్‌గా తనను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నందుకు జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రస్తుతం తాను చిన్నమండెం మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో యుటిఎఫ్ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు. సిపిఎస్ రద్దు, నూతన జాతీయ విద్యా విధానం రద్దు కోసం , ఉద్యోగ ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాల కోసం యుటిఎఫ్ ఉద్యమాలలో చురుకుగా పాల్గొంటానని తెలిపారు.

ప్రాసెసింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, జెసి

జిల్లా రీ సర్వే ప్రాసెసింగ్ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - రాయచోటి

జిల్లా రీ సర్వే ప్రాసెసింగ్ కేంద్రాన్ని గురువారం ఉదయం స్థానిక రాయచోటి కలెక్టరేట్ వెనక వైపు ఉన్న సర్వే విభాగ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన రీ సర్వే ప్రాసెసింగ్ కేంద్రాన్ని జిల్లాలోని సర్వేయర్లందరూ ఉపయోగించుకోవాలని, రీ సర్వే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని సర్వేయర్లు అందరికీ ఉపయోగకరమైన ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినందుకు అసిస్టెంట్ డైరెక్టర్ జయరాజ్‌ను అభినందించారు. సర్వే శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలలో పనిచేస్తున్న సర్వేయర్లు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని సర్వే శాఖ కమిషనర్ సిద్ధార్థ జైన్ ఐఎఎస్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రం రాయచోటిలో ప్రాసెసింగ్ కేంద్రాన్ని ప్రారంభించాలని అనుకున్నామని, కలెక్టర్ సహకారంతో ఈ కేంద్రాన్ని ప్రారంభించినట్లుగా తెలిపారు. ఈ కేంద్రం ద్వారా జిల్లాలోని అనేక చోట్లలో పనిచేస్తున్న సర్వేయర్లు జిల్లా కేంద్రానికి వచ్చి వారి రీ సర్వేకి సంబంధించిన పనులను పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌ఓ సత్యనారాయణ, సర్వే శాఖ ఏడి జయరాజ్, సర్వే శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో రామాలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని వెంకటంపల్లిలో గురువారం ఎమ్మెల్యే మేడా వెంకట మల్లిఖార్జునరెడ్డి టిటిడి సహకారంతో రూ.10 లక్షలు నిధులతో రామాలయ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఆలయాలు సంస్కృతికి నిలయాలని, ఆధ్యాత్మికత, శాంతి నెలకొల్పేందుకు ఆలయాలు దోహదపడతాయని మేడా పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటంపల్లి ఉప సర్పంచ్ నరసింహులు, మండలం, పట్టణ జెసిఎస్ కన్వీనర్లు మందరం గంగిరెడ్డి, వడ్డే రమణ, మురళిరెడ్డి, హస్తవరం ఉమామహేశ్వర్ రెడ్డి, సత్యాల రామకృష్ణ, సౌమిత్రి చంద్రనాథ్, దాసరి పెంచలయ్య, శంకర్ శెట్టి, నాగేంద్ర, రమణయ్య, రామయ్య, గ్రామస్థులుపాల్గొన్నారు.

రూ.15 వేల నష్టపరిహారం చెల్లించాలి : జనసేన

ప్రజాశక్తి-మదనపల్లి

తుపాను ధాటికి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15 వేలు నష్టపరిహారం చెల్లించాలని జనసేన పార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామదాస్ చౌదరి అన్నారు. గురువారం తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలియజేశారు. అనంతరం తహశీల్దార్ మహబూబ్ చాంద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాందాస్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల పట్ల తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని తెలిపారు. రైతులను ఉదారంగా ఆదుకోవడంలో విఫలమైందన్నారు. మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులను కలసి వివరాలు సేకరించారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతాంగాన్ని ఉదారంగా అదుకోవాలని కోరారు. నియోజకవర్గంలోని నిమ్మనపల్లె, రామసముద్రం, మదనపల్లె మండలలోని రైతంగం తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వ్యవసాయాధికారులు అప్పుడప్పుడు వెళ్లి చూడటమే కానీ, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరు కూడా రైతుల దుస్థితి తెలుసుకుని పరామర్శించిన దాఖలు లేదన్నారు. నష్టపోయిన వరి, టమోటా, ఉద్యానవన, వాణిజ్య పంటలకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, రాష్ట్ర చేనేత ప్రధాన కార్యదర్శి అడపా సురేంద్ర, పట్టణ అధ్యక్షులు నాయని జగదీష్, రూరల్ మండల అధ్యక్షులు గ్రానైట్ బాబు, రెడ్డెమ్మ, జంగాల గౌతమ్, జయ, నవాజ్, నాగ, లవన్న, జనార్ధన్, రాజారెడ్డి, పవన్, నాగవేణి, మజ్జల నవీన్, ఆదినారాయణ పాల్గొన్నారు.



నేలకొరిగిన వరిని పరిశీలిస్తున్న నాయకులు

ప్రజారోగ్య సంరక్షణే ప్రధాన లక్ష్యం

ప్రజాశక్తి-పీలేరు

పట్టణ ప్రజల ఆరోగ్య సంరక్షణే ప్రధాన లక్ష్యం భావించి పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టినట్లు గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ జీనత్ షఫీ తెలిపారు. రెండవ రోజు వార్డుబాట కార్యక్రమంలో భాగంగా గురువారం 14వ వార్డు పరిధిలో సర్పంచ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో మురుగు నీటి కాలువల్లో తెప్పలు తెప్పలుగా పేరుకుపోయిన చెత్తా, చెదారాలను యుద్ధ ప్రాతిపదికన శుభ్రం చేయిస్తూ ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇఒ ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్ రవి, మేస్త్రీలు ప్రతాప్‌రెడ్డి, భాస్కర్, ఎలక్ట్రీషన్ ముబారక్, పంచాయితీ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ షఫీ

కరపత్రాలు విడుదల చేస్తున్న శ్రీనివాసులు

11న 'విసికె' జిల్లా ప్రతినిధుల సమావేశం

ప్రజాశక్తి-కలికిరి

ఈనెల 11న నిర్వహించే విసికెపార్టీ జిల్లా ప్రతినిధుల సమావేశంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర విసికె పార్టీ కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పీలేరు పట్టణంలోని బికెఆర్ రెసిడెన్సీలో ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ హాజరవుతారని తెలిపారు. స్థానిక బాస్, విసికె నాయకు లతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ రాబోవు ఎన్నికల్లో జిల్లాలో విసికె పోటీచేయు విషయం పైన, రాష్ట్రం లో బహు జన వర్గాలపై జరుగుతున్న దాడులపై కార్యచరణ రూపొంది స్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని భారతీయ అంబేద్కర్ సేన, విసికె రాష్ట్ర కమిటీ, జిల్లా కమిటీ సభ్యులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముల్లంగి కృష్ణయ్య, గురునాథ, రెడ్డి మోహన్, మదన, వేణు, తేజ, హరినాధ పాల్గొన్నారు.

టైం స్కేల్ పద్ధతిని అమలు పరచాలి

ప్రజాశక్తి-కలికిరి

టైంస్కేల్ పద్ధతిని అమలు చేయాలని ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు వీరభద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో గత పది సంవత్సరాల నుంచి జెఎన్‌టియు, పాలిటెక్నిక్ కళాశాల, కృషి విజ్ఞాన కేంద్రం, పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ వైద్యశాలలో. పనిచేస్తున్నటువంటి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని సీనియారిటి ప్రకారం టైం స్కేల్ పద్ధతిని అమలుచేయాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతంతో పిల్లలు చదువులు, కుటుంబ పోషణ భారమై అప్పులు చేసి తిరిగి వడ్డీ కూడా చెల్లించలేని పరిస్థితులలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చిరు ఉద్యోగుల పట్ల సానుకూలంగా స్పందించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు రమణ, కార్యదర్శులు. ఎ.సిద్దయ్య. సి.జయరాం. సభ్యులు ఆంజనేయులు, నాగభూషణం, .శ్రీరాములు, సుధాకర్,రెడ్డయ్య, నరేష్ పాల్గొన్నారు.

నీటి మోటర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగార్జునాచారి

నీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి-వీరబల్లి

మండలంలోని మట్లి గ్రామపంచాయతీలోని వడ్డేపల్లిలో తాగునీటి సమస్య ఏర్పడడంతో ఆ గ్రామస్తులు స్థానిక సర్పంచ్ నాగార్జునచారి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన ఆయన గురువారం నీటిసౌకర్యానికి కావాల్సిన మోటరు, పైపులు, విద్యుత్‌ను ఏర్పాటు చేశారు. బోరుకు ఉపకరణాలను అందించి విద్యుత్ ట్రాన్స్‌ఫారాన్ని ఏర్పాటు చేయించి గ్రామానికి నీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో వార్డుమెంబర్లు లోకేశ్వర మల్లికార్జున, చెన్నకేశవులు నాగేశ్వర కణితి వెంకటరమణ, గుదే నాగ భూషణ్‌నాయుడు పాల్గొన్నారు.

చినుకు పడితే ఆర్‌టిసి బస్టాండ్ చిత్తడే

ప్రజాశక్తి-గాలివీడు

కొద్దిపాటి వర్షం వచ్చిన చినుకు పడితే చాలు ఆర్‌టిసి బస్టాండు బురదమయమై పోతుంది. బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు ఇబ్బందులకు గురవుతున్నామని ప్రయాణీకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌టిసి అధికారులు దృష్టి పెట్టి ప్లాట్‌ఫామ్‌పై సిమెంట్ వేసి చదును వర్షం వచ్చినా ప్రయాణీకులు, ప్రజలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని చెబుతున్నారు. ఆర్‌టిసి అధికారులు దృష్టిపెట్టి ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రక్తదానం చేస్తున్న యువకుడు

యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ సేవలను నిర్విరామంగా కొనసాగిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు తగాదిరాజశేఖర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకోవడానికి తమ ఫౌండేషన్ ముందు ఉంటుందన్నారు. బెంగ ళూరు నగరంలోని వైదేహి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తికి అత్యవసర సమయంలో రక్తం అవసరం కావడంతో బాధితులు తమను సంప్రదిం చారన్నారు. వారికి కావలసిన రక్తాన్ని తమ ఫౌండేషన్ సభ్యులు అందించారని తెలిపారు. రక్తదానం ప్రాణ దానంతో సమానమని అన్నారు. ఆరోగ్యవంతమైన యువత విరివిగా రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని కోరారు. తమ సంస్థ ద్వారా వందలాదిగా యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో ఎవరికి ఏ అవసరం వచ్చినా తమ ఫౌండేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. వెల్లడించారు.

'వైసిపికి రోజులు దగ్గరపడ్డాయి'

ప్రజాశక్తి-నందలూరు

రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక అవినీతి పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గరపడ్డాయని జనసేన నేత ఎల్లటూరు శ్రీనివాసరాజు పేర్కొన్నారు. జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కల్యాణ్ సమక్షంలో పార్టీలో చేరి గురువారం రాజంపేట నియోజకవర్గానికి విచ్చేసిన సందర్భంగా నియోజకవర్గ ప్రజలతోపాటు జనసైనికులు ఘనంగా ఆహ్వానం పలికారు. సిద్ధవటం, ఒంటిమిట్ట, నందలూరు, రాజంపేట నాలుగు మండలాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత పరిణామాలు భవిష్యత్తులో జరిగే ఎన్నికల్లో మార్పు తధ్యమని ఆశాభావం చేశారు. ఉన్నత ఉద్యోగిగా పనిచేస్తూ ఉద్యోగానికి రాజీనామా చేసి కేవలం ప్రజాసేవ చేయడానికి పవన్‌కల్యాణ్ భావాలు నచ్చి జనసేన పార్టీలో చేరానని తెలిపారు. ఆయన ఆశయాలకు, భావజాలానికి అనుగుణంగా భవిష్యత్తులో నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారమే పరమావధిగా పనిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో జనసైనికులు పాల్గొన్నారు.

నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కడప అర్బన్

మలినేని పట్నం గ్రామం, సిద్ధవటం గ్రామం భాకరాపేట వద్ద ఉన్న శ్రీ సాయి నారాయణ నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్ పై చర్యలు తీసుకోవాలని ఉమ్మడి జిల్లా ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం అధ్యక్షులు నేతి నాగేశ్వర గురువారం జిల్లా విద్యాశాఖ అధికారికి రాఘవరెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగేశ్వర మాట్లాడుతూ సిద్ధవటం గ్రామం భాకరాపేట వద్ద ఉన్న శ్రీ సాయి నారాయణ నవోదయ సైనిక్ కోచింగ్ సెంటర్లో దాదాపుగా 250 మంది విద్యార్థులపైగా కేవలం 5వ తరగతి విద్యార్థులు మాత్రమే ఉన్నారని తెలిపారు. ఆ కోచింగ్ కొన్ని సంవత్సరాలుగా స్థానికంగా నడుపుతూ ఉన్నప్పటికీ ఎంఇఒతో తనకు సంబంధం లేనివిధంగా వ్యవహరిస్తూ విద్యార్థుల తల్లిదండ్రుల దగ్గర వేల రూపాయలు దండుకుంటూ ఆ కోచింగ్ యాజమాన్యం వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' అందరి ఆట : 'కొరముట్ల'

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

ఆడుదాం ఆంధ్ర ఇది అందరి ఆట అని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వం తొలిసారిగా గ్రామ,వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో భాగంగా ఎంపిడిఒ కార్యాలయంలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందించారు. ఈసందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా సంబరాలు ఈనెల 15 నుంచి ప్రారంభమవుతాయని అన్నారు. నియోజకవర్గంలోని సచివాలయ పరిధిలో వాలంటీర్లు రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపడతారని అన్నారు. ప్రతి ఒక్కరినీ క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవన శైలిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ప్రతిభావంతులైన క్రీడాకారు లను కనుగొని వారిని పెద్ద వేదికకు పరిచయం చేయడం క్రీడా నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ప్రతి ష్టాత్మకంగా ఈకార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. 15 ఏళ్లు పైబడిన ఆసక్తి కలిగినవారు వెబ్‌సైట్, యాప్ ద్వారా తమ పేరును నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడల నిర్వహణ ఉంటుందని ఇందులో పురుషులు, మహిళలకు విడివిడిగా క్రీడలు నిర్వహిస్తారని తెలిపారు. క్రికెట్, కబడ్డీ ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ ఐదు అంశాలలో క్రీడా పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. సచివాలయం స్థాయిలో గెలుపొందిన జట్లకు మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు జరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి రామిరెడ్డి ధ్వజారెడ్డి, చిట్వేల్ మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులు రెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జడ్‌పిటిసి రత్నమ్మ, ఉపసర్పంచ్ తోట శివసాయి, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టిరమేష్, పట్టణఅధ్యక్షుడు సిహెచ్.రమేష్, తహశీల్దార్ రామ్మోహన్,ఎంపిడిఒ జాషువా, ఎంఇఒ బాబీ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు అందిస్తున్న కొరముట్ల శ్రీనివాసులు

లక్కిరెడ్డిపల్లి : గ్రామస్థాయిలో క్రీడా స్ఫూర్తి ప్రదర్శించి వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీసి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడమే జగనన్న ప్రవేశపెట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎంపిపి మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి పేర్కొ న్నారు. స్థానిక ఎంపిడిఒ సభాభవనంలో పంచాయతీ కార్యదర్శులకు క్రీడా పోటీలకు సంబంధించిన క్రీడా సామగ్రిని పంపిణీ చేశారు.క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించేందుకే ఈ క్రీడలు నిర్వహిస్తున్నారని,క్రీడాకారులు ఈ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యులు సయ్యద్‌అమీర్, మండలఉపాధ్యక్షుడు సమరసింహా రెడ్డి, ఉపసర్పంచ్ రాజారెడ్డి, జెసిఎస్ మండల కన్వీనర్ లక్ష్మీ నారా యణ, ఎంపిటిసి శంకరనాయుడు, సర్పంచులు వెంకటనారా యణరెడ్డి, గడ్డం కళ్యాణి, ప్రభాకర్‌రెడ్డి, మాజీసర్పంచ్ వెంక టాద్రి నాయుడు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

అల్లర్లు లేకుండా సామరస్యంగా ఉండాలి : సిఐ

బిసి కాలనీలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ, ఎస్ఐలు

ప్రజాశక్తి-గాలివీడు

గ్రామాలు, పల్లెలలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రతి ఒక్కరూ సామరస్యంగా మెలగాలని లక్కిరెడ్డిపల్లి సిఐ జిజె.గంగాధర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం రాత్రి గోరాన్ చెరువు పంచాయతీలోని బిసికాలనీ వాసులకు సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ప్రజలందరూ ఐకమత్యంగా, సామరస్యంగా కలిసిమెలిసి ఉండాలని పేర్కొన్నారు. చిన్న చిన్న విషయాలకు సర్దుకుపోవాలని ఒకరిపై ఒకరు దూషణలకు, ఘర్షణలకు పాల్పడటం మంచి పద్దతికాదని అన్నారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించకుండా గ్రామస్తులందరూ పోలీసులకు సహకారం అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శివకుమార్, మాజీ ఎంపిటిసి చిన్నరెడ్డి, వెంకటాద్రి బ్రహ్మానందరెడ్డి, బట్టి రమణ, ఎఎస్ఐ అంజిరెడ్డి, మహిళలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : వైసిపి

ప్రజాశక్తి-గాలివీడు

అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డేనని వైస్‌ఎంపిపి-1 మిట్టపల్లి యధుభషన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం వెలుగల్లు గ్రామ సచివాలయంలో సంక్షేమ పథకాల కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెలిగల్లు గ్రామా నికి రూ.19కోట్లు వివిధ సంక్షేమ పథకాల నుంచి ప్రజలకు అందినట్లు ఆయన పేర్కొన్నారు కార్యక్రమం లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జాబిర్‌అహ్మద్, ఎంపిటిసి నవాజ్‌షరీఫ్, వైస్‌ఎంపిపి-2, గాలి శ్రీనివాసులు, వైసిపి మైనార్టీ మండల నాయ కుడు ఎస్.కె.ఖాదం మోదీన్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు బాబాఫక్రుద్దీన్, నాగేశ్వ రమ్మ, విశ్వనాథరెడ్డి, రమణారెడ్డి, మనోహర్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** రాష్ట్రం అన్నివిధాల అభివృద్ధి చెందాలంటే వై.ఎస్.జగన్మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాలని, ఆయనకు మరో మారు అవకాశం ఇవ్వాలని ఊటుకూరు ఎంపిటిసి నాగచంద్రశేఖర్ రెడ్డి అన్నారు. గురువారం పంచాయతీ కార్యదర్శి వెంకట శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఊట్కూరు సచివాలయంలో రాష్ట్రానికి జగనే ఎందుకు కావాలి కార్యక్ర మాన్ని నిర్వహించారు. ముందుగా సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్క రించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపీటీసీ శేఖర్ రెడ్డి పాల్గొని సమావేశంలో ప్రసంగిస్తూ సచివాలయం, వాలంటీర్లు వ్యవస్థను తీసు కువచ్చి రాష్ట్రాన్ని దేశానికే

సంక్షేమ పథకాల కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న యధుభూషణ్‌రెడ్డి

ఆదర్శంగా తీర్చిదిద్దారని అన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి వారి గడప వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నారని, ఈ ఘనత కేవలం వైయస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని తెలిపారు. కుల, మత, వర్గ, లింగ, రాజకీయ వివక్ష లేకుండా వైసిపి ప్రభుత్వం ప్రతి ఒక్కరిని సమానంగా ఆదరిస్తుందని అన్నారు. కార్యక్రమంలో జెసిఎస్ కన్వీనర్ మందరం గంగిరెడ్డి, ఊటుకూరు ఎంపిటిసి-2, శ్రీనివాసరాజు, సర్పంచ్ ఈశ్వరయ్య, సచివాలయ కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, సుబ్బరాయుడు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పాల్గొన్నారు.

మామిడిలో సస్యరక్షణతో అధిక దిగుబడులు

కోనంపేటలో వంగతోటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి

మామిడిలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగబడులు పొందవచ్చునని కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ మానస పేర్కొన్నారు. గురువారం కోనంపేట మామిడి, కంది, కూరగాయ పంటలైన టమోటా వంగ, మిరప పంటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ఈ మధ్యకాలంలో వర్షాలు అధికంగా కురుస్తున్నందువలన మామిడి లో పూత రావాలంటే ఆలస్యం అవుతుందనీ, పూత రావాలంటే13బి 0:14 రకం మందును 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. మామిడిలో పక్షి కన్ను పురుగు ఎక్కు వగా ఆశించే కాశం ఉందని ఇదే రకం మందును పిచికారీ చేయాలన్నారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి మాసాలలో పూత వచ్చే అవకాశలు ఉన్నాయని, మామిడి రైతులు సేద్యం చేయించి శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ వర్షాకాలంలో కూరగాయ పంటల్లో ముఖ్యంగా బూజు తెగులు సోకే అవకాశం ఉందని19:19:19 రకం మందులను పిచికారి చేయాలన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం విస్తరణాధికారి డాక్టర్ లక్ష్మీదేవి, విహెచ్.హరిత, రైతులు పాల్గొన్నారు.

దళిత గ్రామాలను కాపాడాలని ఆర్‌డిఒకు వినతి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

దళిత గ్రామాలను కాపాడాలని, తమ కాలనీలో ఖాళీగా నివాస యోగ్యానికి అనుకూలంగా ఉన్న స్థలాలను, శ్మశానాలను కొందరు నాయకులు ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని పుల్లం పేట మండలం అనంతసముద్రంకు చెందిన కొందరు దళితులు గురువారం ఆర్‌డిఒ రామకృషారెడ్డికు విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అనంతసముద్రం రెవెన్యూ గ్రామంలోని సర్వే నంబర్ 302లో తమ కాలనీ ఉందని, దాదాపు 30 ఏళ్లుగా నివాసం ఉంటున్నామని, కాలనీ లోనే నివాసయోగ్యమైన స్థలం ఉండడంతో అర్హులైన వారికి ఇళ్ళ స్థలాలు ఇవ్వాలని కోరామని తెలిపారు. స్థానిక నాయకులు తమ కాలనీ లోని స్థలాన్ని 364/1 సర్వే నెంబర్‌లో శ్మశాన స్థలాన్ని కూడా కాజేసెందుకు కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి దళితకాలనీ అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టి, తమ కాలనీలోని అర్హులైన దళితులకు ఇళ్ళ స్థలాలను ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు.

ఆర్‌డిఒతో మాట్లాడుతున్న గ్రామస్తులు



ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న జెసి ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

తప్పుల్లేని ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలి : జెసి

ప్రజాశక్తి-పీలేరు

తప్పుల్లేని ఓటరు జాబితాను సిద్ధం చేయాలని జెసి ఫర్మాన్‌అహ్మద్‌ఖాన్ తహశీల్దార్లలను ఆదేశించారు. గురువారం స్థానిక ఓటరు నమోదు అధికారి కార్యాలయంలో అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ పీలేరు నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల తహశీల్దారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. బిఎల్‌ఒలు తమకు అందే క్లైములపై సత్వర విచారణ చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మృతుల ఓట్లు తొలగించే క్రమంలో వారి కుటుంబ సభ్యుల అంగీకారాన్ని రాత మూలకంగా తీసుకోవాలని అన్నారు. ఓటు తొలగించడానికి ముందు అక్కడి పరిసర నివాసీలతో విచారించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అక్టోబర్ 27న విడుదలైన ఓటర్ల ముసాయిదాపై మాట్లాడుతూ పాత ఓటర్ల జాబితాకు, ప్రస్తుత జాబితాకు మధ్య ఉన్న వ్యత్యాసాలపై సమీక్షించినట్లు తెలిసింది. సమావేశంలో ఎన్నికల నమోదు అధికారి గోపాలకృష్ణ, గుర్రంకొండ, కలకడ, కెవిపల్లి, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు మండలాల తహశీల్దార్లు ఖాజాబీ, ప్రదీప్, నరసింహులు, ఫిరోజ్ ఖాన్, భాగ్యలత, ధనుంజయులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలు గుర్తించండి : ఎస్‌పి

ప్రజాశక్తి-పెద్దమండ్యం

మండలంలోని పోలీస్ స్టేషన్‌ను ఎస్‌పి కృష్ణారావు గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు దగ్గర పడుతుండడంతో సమస్యాత్మకంగా ఉన్న కేంద్రాలను గుర్తించి అక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఐకు సూచించారు. మండలంలో పేకాట, జూదం వంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్లో సిబ్బందిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ములకలచెరువు సిఐ మధు, ఎస్ఐ రామాంజనేయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న రైతు జగదీష్‌రెడ్డి

దత్తత రైతుకు మిలియనీర్ ఫార్మర్ అవార్డు

ప్రజాశక్తి-కలికిరి

కెవికె కలికిరి దత్తత రైతు జగదీశ్‌రెడ్డి మిలియన్ ఫార్మర్ అవార్డుకు ఎంపికైనట్లు కెవికె కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన భారతీయ వ్యవసా యపరిశోధనా సంస్థ, కృషి జాగరన్ ఢిల్లీలో బుధవారం నిర్వహించిన మిలీయనీర్ రైతు అవార్డుల ప్రధానోత్సవంలో దత్తత రైతు యనమల జగదీశ్‌రెడ్డి, దండువారిపల్లి గ్రామం, బంగారుపాలెం మండలానికి చెందినవారికి సేంద్రీయ వ్యవసాయంలో మిల్లి యనీర్ అవార్డు పొందినట్లు తెలిపారు. సేంద్రియ వ్యవసాయంలో వేరుశనగ, వరి, వివిధ పంటల్లో సేంద్రియ వ్యవసాయం అవలంబించి అధికలాభాలు పొంది నందుకుగాను గుజ రాత్ గవర్నర్ ఆచార్య దేవరత్, మాజీ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాజీ కేరళ రాష్ట్ర గవర్నర్ సదాశివ, కృషి జాగారం మేనేజింగ్ డైరెక్టర్ షని డోమోనిక్, నీతి ఆయోగ్ అధికారి నీలం పటేల్ చేతుల మీదుగా మిలియనీర్ ఫార్మర్ అవార్డును అందజేశారని తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థినితో ఉపాధ్యాయులు

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కోన విద్యార్థి

ప్రజాశక్తి-కలకడ

మండలంలోని కోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న జైనాబ్ ఖానం జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోడెం చంగల్ రాయుడు తెలిపారు. ఈ పోటీలు ఢిల్లీలో ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. శిక్షణ ఇచ్చిన పీడీ ఝాన్సీరాణి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందిం చారు. క్రీడలలో ఆసక్తి ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తామని తెలిపారు.

ఓటు వేసే విధానం తెలుసుకోవాలి

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రానన్న ఎన్నికలలో ప్రతి ఓటరుకు ఇవిఎం యంత్రాలపై అవగాహన ముఖ్యమని అప్పుడే ఓటును సులభంగా వేయగలమని తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం దాదం వడ్డీపల్లి, పంచాలమర్రి ఓటర్లకు ఇవిఎం మిషన్లపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విఆర్‌ఒ వెంకట్రమణ, పంచాయతీ సెక్రటరీ గీత, లక్ష్మి లు ఇవిఎంల వినియోగం, ఓటర్లు ఓటు వేసే తీరుపై ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బిఎల్‌ఒలు నాగరాజ్, విఆర్‌ఎ సురేష్, ఎరుకులప్ప, వెంకటరమణ, ఆనందమ్మ పాల్గొన్నారు.

కుల గణనపై సమావేశం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్పెషల్ ఆఫీసర్ స్కందప్ప కోరారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం కులగణనపై అధికారులు ప్రజాప్రతినిధులు, కుల సంఘాల నాయకులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. కుల గణనలో ప్రతి కుటుంబం సామాజిక ఆర్థిక స్థితిగతులు గుర్తించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో అన్ని వర్గాల వారికి సముచిత న్యాయంతో అభివృద్ధి బాటలో నడిపేందుకే ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. గతంలో 1931 వ సంవత్సరంలో కులగణన జరిగిందని ఆ తర్వాత రెండొసారి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కుల గణన కార్య క్రమాన్ని చేపట్టారని అన్నారు ప్రజలు కూడా సహకరించి తమ పూర్తి సమాచారాన్ని వారికి తెలియ చెప్పా లన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ శ్రీనివాసులు, ఎంపిడిఒ సురేంద్రనాథ్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ సురేంద్ర నాథ్, మండలాభివృద్ధి కమిటీ చైర్మన్ రెడ్డి కో-ఆప్షన్స్ సభ్యులు జమాల్ బాషా, వైస్ ఎంపిపి కరీం, పాల్గొన్నారు.

దళితులకు శ్మశాన స్థలం ఏర్పాటు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని పెరియవరం రెవెన్యూ పరిధిలోని రామక్కపల్లి ఎస్‌సి కాలనీవాసులకు తహశీల్దార్ నరసింహకుమార్ ఆధ్వర్యంలో గురువారం శ్మశానానికి సర్వేనెంబర్ 598లో 50 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా మా కాలనీ వాసులకి శ్మశాన స్థలం లేకపోవడంతో తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఆయన స్పందించి 50 సెంట్లు ప్రభుత్వ స్థలాన్ని శ్మశానానికి కేటాయించడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్‌కుమార్, విఆర్‌ఒ మల్లికార్జున, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీపై అవగాహన కల్పిస్తున్న ఇన్‌స్పెక్టర్

'లీగల్ మెట్రాలజీ'పై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి -తంబళ్లపల్లె

మండలంలోని సచివాలయ ఉద్యోగులు లీగల్ మెట్రాలజీ పై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని తంబళ్లపల్లె డిఎల్‌డిఒ లక్ష్మీపతి తెలిపారు. గురువారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆరు మండలాల సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉద్యోగులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీలో భాగంగా మారుమూల గ్రామాల్లోని ప్రజలు తూనికలు, నాసిరకం వస్తువులు అమ్మకాలపై తనిఖీ చేసి తగు చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. మాంసపు దుకాణాల , సూపర్ బజార్లులో ప్రజలకు ఇచ్చే సరుకుల్లో తూకాలు తక్కువ ఇవ్వడంతో పాటు నాసిరకంగా ఉండే పదార్థాలు ఇవ్వడం, సమయం గడిచిపోయిన సరుకులు అమ్మడం, చిన్నపిల్లలకు సరఫరా చేసే పాలు, రొట్టెలు, తినుబండారాలు పై నిఘా ఉంచి అనుమానం వచ్చిన వెంటనే తనిఖీ చర్యలు తీసుకోవాలని సూచించారు. లీగల్ మెట్రాలజీపై జిల్లా లీగల్ మెట్రాలజీ ఇన్స్‌పెక్టర్లు నాగరాజు, రమేష్ కుమార్ రెడ్డిల అధికారులకు లీగల్ మెట్రాలజీ నిర్వహణ, విధివిధానాలపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సురేంద్రనాథ్, ఎఒ ఆనంద్‌కుమార్, ఆరు మండలాల సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

9న పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-కడప : కడపలోని ప్రభుత్వ పురుషుల కళాశాల ఏర్పడి 75 సంవత్సరాల కావస్తున్న సందర్భంగా 2023 సంవత్సరంలో వజ్రోత్సవాలు నిర్వహించాలని కళాశాల నిర్ణయించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ జి. రవీంద్రనాథ్ తెలిపారు. కళాశాలలో ఇంటర్/డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులందరూ ఈనెల 9న రెండవ శనివారం కళాశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశానికి పెద్ద సంఖ్యలో పూర్వ విద్యార్థులు హాజరై విజయవంతం చేయాలని విద్యార్థులను కోరారు.